సాక్షి
రంగారెడ్డి
శనివారం । 11 । నవంబర్ । 2023



చేతులెత్తండి నుంచి..
ఒకప్పుడు చేతులెత్తి అభ్యర్థుని ఎన్నుకోగా ఈవీఎంల సాయంతో ఓటుహక్కును వినియోగించుకునే స్థాయికి వచ్చింది. 10లో▸



ఆగమేఘాల కమలం
గ్రేటర్ పరిధిలో బీజేపీ 5 అసెంబ్లీ స్థానాలకు బీజేపీ అధిష్ఠానం ఆగమేఘాలపై అభ్యర్థులను ఖరారు చేసింది. 10లో▸



ఓటు.. కారాదు వృథా
ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ సూచించారు. 10లో▸

న్యూస్‌రీల్

తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం

కేంద్ర మంత్రి బీఎల్ వర్మ



ర్యాలీలో పాల్గొన్న కేంద్రమంత్రి బీఎల్ వర్మ తదితరులు

చేవెళ్ల: తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నింటిలోనూ పూర్తిగా విఫలమైందని కేంద్ర మంత్రి బీఎల్ వర్మ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందన్నారు. ప్రజాపాలనను గాలికొదిలేసి కుటుంబపాలన సాగించారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపిస్తే కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ సర్కార్‌తో ఎంతో అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాశ్, అంసెబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరగాలి



నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్ శిల్పశర్మ

చేవెళ్ల: ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా జరిగేలా చూసుకోవాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్, ఐఏఎస్ శిల్పశర్మ అన్నారు. చేవెళ్లలోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ, నామినేషన్ల తీరును పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని నామినేషన్లు వచ్చాయి తదితర వివరాలను రిటర్నింగ్ అధికారి సాయిరాంను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఆమెకు రిటర్నింగ్ అధికారి, ఎన్నికల అధికారులు స్వాగతం పలికారు.

కోడ్ ఉల్లంఘించారని ఎన్నికల అధికారుల కొరడా

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులపై అధికారులు కేసులు నమోదు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి 3వేల మందితో ర్యాలీకి అనుమతి తీసుకొని 20 వేలకు పైగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 5వేల మందికి అనుమతి తీసుకొని 20వేలకు పైగా జనసమీకరణ చేసినందుకు ఎన్నికల అధికారులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిపై కేసులు నమోదు చేశారు. మరోవైపు నామినేషన్ల సందర్భంగా గురువారం జరిగిన రాళ్లదాడిపై పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఈ క్రమంలో కేసులు నమోదు చేసిన పోలీసులు దాడిలో పాల్గొన్న వారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి శుక్రవారం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 13 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీస్‌లపై దాడి చేశారని ఫిర్యాదు

ఆందోళనను అడ్డుకొని పరిస్థితిని సద్దుమణిగేలా చేయడానికి ప్రయత్నించగా పోలీసులపై దాడి చేశారని కానిస్టేబుల్ శ్రీనివాస్ ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలస్యంగా వచ్చానట!

సమయానికి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకోలేకపోయిన భారత చైతన్య యువజన పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ అభ్యర్థి వి.చంద్రశేఖర్ గౌడ్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల దాటిన తర్వాత కార్యాలయానికి వచ్చారంటూ ఆయనను నామినేషన్ వేయకుండానే వెనక్కు పంపించారు. కాగా.. తాను 11 నుంచి 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోనే ఉన్నానని.. తన ముందు వచ్చిన వారి నామినేషన్లు తీసుకొని తనది పక్కన పెట్టారని చంద్రశేఖర్ గౌడ్ ఆరోపించారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. తాను 3 గంటలకు సమయం ముగుస్తుందనే విషయాన్ని 10 నిమిషాల ముందుగానే అనౌన్స్ చేయించానని రిటర్నింగ్ అధికారి వివరణ ఇచ్చారు.

– రాజేంద్రనగర్



మహేశ్వరంలో నామినేషన్ వేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డి



చేవెళ్లలో నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్



కల్వకుర్తిలో నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి ఆచారి

ఆఖరి రోజు అట్టహాసంగా..

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- అభిమానులు, కార్యకర్తలతో భారీ ర్యాలీలు
- ఆఖరి నిమిషంలో హడావుడిగా పరుగులు
- 13న నామినేషన్ల పరిశీలన.. 15న ఉపసంహరణ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. ఆఖరి రోజు కావడంతో అభ్యర్థులంతా భారీ ర్యాలీలతో నామినేషన్లు వేసేందుకు వచ్చారు. ఎన్నికలకు ముందే బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు బలప్రదర్శనకు దిగారు. గురువారం ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థుల నామినేషన్ సందర్భంగా చోటు చేసుకున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్ర బలగాల భద్రత మధ్య అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. భారత చైతన్య యువజన పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ అభ్యర్థి వి.చంద్రశేఖర్ గౌడ్ చివరి నిమిషంలో రిటర్నింగ్ ఆఫీసర్ కేంద్రానికి చేరుకున్నారు. అప్పటికే మధ్యాహ్నం 3 గంటలు దాటడంతో ఆయన నామినేషన్ స్వీకరించేందుకు రిటర్నింగ్ అధికారి నిరాకరించారు. ఈ నెల 13న నామినేషన్ల పరిశీలన, 15న ఉపసంహరణ ఉండనున్నాయి. 30న పోలింగ్ నిర్వహించనున్నారు.

భారీ ర్యాలీతో వెళ్లి..

- మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి, భారీ ర్యాలీగా మహేశ్వరం చేరుకున్నారు. నామినేషన్ దాఖలు చేసిన తర్వాత బహిరంగ సభలో మాట్లాడారు.
- శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థి రవికుమార్ యాదవ్ మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి ర్యాలీగా వెళ్లి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు.
- ఎల్బీనగర్ బీజేపీ అభ్యర్థి సామరంగారెడ్డి నామినేషన్ ర్యాలీలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పాల్గొన్నారు.
- రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ మద్దతుదారులతో భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు.
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్, సీపీఎం అభ్యర్థి పగడాల యాదయ్య సహా పలువురు నామినేషన్లు సమర్పించారు.
- షాద్‌నగర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్ ర్యాలీగా వెళ్లి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు.
- చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్, బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం, బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య తరపున వారి కుటుంబ సభ్యులు నామినేషన్లు వేశారు. ఇప్పటికే వీరంతా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా, మిగిలిన సెట్లను వారి కుటుంబ సభ్యులు సమర్పించారు.

ఆఖరి రోజు ఇలా..

- ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో శుక్రవారం 24 మంది 25 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇప్పటి వరకు ఇక్కడ మొత్తం 39 మంది అభ్యర్థులు 58 సెట్లు వేశారు.
- శేరిలింగంపల్లిలో 25 మంది 30 నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఇక్కడ మొత్తం నామినేషన్ల సంఖ్య 41కి చేరింది.
- రాజేంద్రనగర్‌లో 19 మంది 26 సెట్లు వేశారు. ఇప్పటి వరకు 33 మంది అభ్యర్థులు 64 సెట్లు దాఖలు చేశారు.
- ఎల్బీనగర్‌లో 32 మంది అభ్యర్థులు 49 సెట్లు వేశారు. ఇప్పటి వరకు ఇక్కడ 62 మంది అభ్యర్థులు 87 సెట్లు సమర్పించారు.
- మహేశ్వరంలో 17 మంది, 19 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు 34 మంది అభ్యర్థులు 54 సెట్లు దాఖలు చేశారు.
- కల్వకుర్తిలో 22 మంది అభ్యర్థులు 31 సెట్లు వేశారు. ఇప్పటి వరకు ఇక్కడ మొత్తం 28 మంది 52 సెట్లు దాఖలు చేశారు.
- చేవెళ్లలో 13 మంది 18 సెట్లు వేశారు. ఇప్పటి వరకు 19 మంది అభ్యర్థులు 38 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.
- షాద్‌నగర్‌లో 17 మంది 27 నామినేషన్లు వేశారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 24 మంది 48 సెట్లు దాఖలు చేశారు.

'పట్నం'లో కాంగ్రెస్ రెబల్‌గా 'దండెం'

అబ్దుల్లాపూర్‌మెట్: కాంగ్రెస్ పార్టీని 20 ఏళ్లుగా నమ్ముకున్న తనను అధిష్ఠానం మోసం చేసిందని, ఇబ్రహీంపట్నం నుంచి రెబల్ అభ్యర్థిగా పోటీ చేసి తన సత్తా చూపిస్తానని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు దండెం రాంరెడ్డి అన్నారు. పార్టీ టికెట్ కోసం చివరి వరకూ పోరాడిన ఆయన అనుచరులు, అభిమానుల అభీష్టం మేరకు రెబల్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు పెద్దఅంబర్‌పేటలోని ఆయన నివాసం నుంచి వేలాది మంది అనుచరగణంతో భారీ ర్యాలీగా తరలివెళ్లి గ్రామంలోని బోనమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న దండెం రాంరెడ్డి

ఆశీర్వదించి గెలిపిస్తే అండగా ఉంటా

షాద్‌నగర్ ఏఎఫ్‌బీ అభ్యర్థి పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపిస్తే సేవకుడిలా ఉంటానని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని సాయిబాలాజీ టౌన్‌షిప్ నుంచి ముఖ్యకూడలి వరకు పార్టీ సింహం గుర్తుతో భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యకూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పట్టణ సమీపంలో వేలాది మందితో సింహగర్జన పేరుతో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయాలు భ్రష్టుపట్టి పోయాయని, ప్రజల ఆకాంక్ష ఒకలా ఉంటే నాయకుల ఆలోచన మరో విధంగా ఉందని అన్నారు. రాజకీ ప్రక్షళనతోనే మార్పులు సాధ్యమని, ఆమార్పు మీ చేతుల్లోనే ఉందన్నారు. న్యాయానికి, అన్యాయానికి, ధర్మానికి, అధర్మానికి జరుగుతున్న యుద్ధంలో తాను న్యాయం, ధర్మం వైపు పోరాడుతున్నానని పేర్కొన్నారు. ఈ యుద్ధంలో న్యాయం, ధర్మమే గెలుస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో సింహం గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌సింగ్, విజయభాస్కర్, నర్సింహయాదవ్, మల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, ఆకుల ప్రదీప్, చేగు సుధాకర్, ఇస్నాతి శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, లష్కర్‌నాయక్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

'కార్డు' లేనోళ్ల సంగతేంటి?



బహుళ ప్రయోజనకారి తెల్ల రేషన్ కార్డు

- అధికార బీఆర్‌ఎస్ మేనిఫెస్టో అమలైతే..
- రేషన్ కార్డుపై సన్నబియ్యం.. రూ.5 లక్షల బీమా
- ఆరోగ్యశ్రీ కింద రూ.15 లక్షల వరకు చికిత్స
- గ్రేటర్‌లో 21.22 లక్షల పేద కుటుంబాలకు ప్రయోజం
- కార్డులేని మరో 10 లక్షల కుటుంబాల పరిస్థితేంటి?
- మూడేళ్లుగా ఊసేలేని కొత్త కార్డుల మంజూరు
- అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం

ఎలక్షన్ ఎజెండా..

సాక్షి, సిటీబ్యూరో: మళ్లీ అధికారమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో తెల్లరేషన్ కార్డులకు మరింత ప్రాధాన్యం పెంచినట్లయింది. కేవలం పీడీఎస్ బియ్యానికే పరిమితం కాకుండా రేషన్ కార్డు బహుళ ప్రయోజనకారిగా తయారు కానుంది. అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధిస్తే కార్డుదారులకు పీడీఎస్ దొడ్డు బియ్యం బదులు సన్న బియ్యం, రైతు బీమా తరహాలో అర్హులైన పేద కుటుంబాలకు రూ.5 లక్షల బీమా హామీ అమలైతే హైదరాబాద్ మహానగర పరిధిలో సుమారు 21.22 లక్షల పేద కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అయితే.. మరో పది లక్షల పేద కుటుంబాలకు రేషన్ కార్డులు లేవు. మూడేళ్లుగా దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్ లాగిన్ కూడా నిలిచిపోయింది. అంతకు ముందు దరఖాస్తుల్లో కేవలం 40 శాతం పెండెన్సీ మాత్రమే క్లియర్ అయింది. మరోవైపు కార్డులో కొత్త సభ్యుల చేర్పులు, మార్పుల దరఖాస్తులకు అవకాశం ఉన్నప్పటికీ ఆమోద ప్రక్రియ ఆరేడేళ్ల నుంచి పెండింగ్‌లో మగ్గుతోంది. అసెంబ్లీ ఎన్నికలపై దీని ప్రభావం పడే అవకాశాలు లేకపోలేదు.

బీమాతో ధీమాగా..

అధికార బీఆర్‌ఎస్ ప్రకటించిన హామీతో పేద కుటుంబాలకు బీమా ధీమాగా మారనుంది. బీమా కోసం తెల్ల రేషన్ (ఆహార భద్రత) కార్డు అర్హత కార్డుగా మారనుంది. అర్హత గల కుటుంబాలకు రైతు బీమా తరహాలోనే.. ఎలాంటి మరణం సంభవించిన ఎల్ఐసీ ద్వారానే ద్వారా రూ.5 లక్షల బీమా ఆర్థిక సాయం వర్తింపజేయనుంది. మరణం సంభవించిన పది రోజుల్లో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల సాయం అందనుంది. ప్రభుత్వం అర్హులైన వారి పేరిట ప్రీమియం చెల్లించి బీమా వర్తింపజేసే విధంగా ఎల్ఐసీ ఒప్పందం కుదుర్చుకొనున్నది. ఈ నిబంధనలు పేద కుటుంబ సభ్యులకు బీమా వర్తింపును దూరం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాస్తవంగా బీమా నిబంధనల ప్రకారం 60 ఏళ్ల లోపు వారే అర్హులు.

కార్డులు ఇలా ..

మహానగరంలో రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లో 22 లక్షలు ఉండగా అందులో ఇతరప్రాంతాల నుంచి వచ్చి రేషన్ పోర్టబిలిటీతో ఇక్కడే రేషన్ సరుకు డ్రా చేస్తున్న కుటుంబాలు నాలుగు లక్షల వరకు ఉండవచ్చని అంచనా. మొత్తమ్మీద కార్డుల్లో సుమారు 66 లక్షల సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది. బీమా నిబంధనలు అమలైతే తెల్ల రేషన్‌కార్డుదారుల్లో 60 దాటిన వారంతా బీమాకు అనర్హులే. కార్డు హోల్డర్ పేరిట బీమా వర్తింపజేస్తే.. మొత్తం కార్డు దారుల్లో 20 శాతం మంది పైగా అర్హత కోల్పోవడం ఖాయంగా కనిపిస్తోంది.

సన్నబియ్యం పంపిణీ

బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం అందనుంది. ప్రస్తుతం దొడ్డుబియ్యం పంపిణీ చేస్తున్నారు. కోవిడ్ సృష్టించిన ఆర్థిక సంక్షోభం కారణంగా గత మూడేళ్లుగా ఉచితంగా పీడీఎస్ బియ్యం పంపిణీ చేస్తున్నారు. కేంద్రం వాటాకు అదనంగా రాష్ట్రం వాటా కలిపి పంపిణీ చేస్తున్నారు. సాధారణంగా ప్రతి కార్డులోని యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున కోటా ఉండగా కోవిడ్ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో కోటాను పెంచారు.

ఆరోగ్యశ్రీ వర్తింపు..

ఇప్పటికే ఆరోగ్యశ్రీ – ఆయుష్మాన్ భారత్ పథకం కింద అందించే ఉచిత చికిత్సలకు ఆహార భద్రత కార్డును కూడా చెల్లుబాటు చేస్తూ నిర్ణయం తీసుకోగా, తాజాగా ఆరోగ్యశ్రీ పథకం రూ. 15 లక్షల పెంపు హామీతో మరింత ఉపశమనం కలుగనుంది.

గ్రేటర్ పరిధిలో రేషన్ కార్డులు ఇలా..

జిల్లా	రేషన్ కార్డులు	యూనిట్లు
హైదరాబాద్	6,39,631	23,64,956
రంగారెడ్డి	5,58,452	18,23,288
మేడ్చల్– మల్కాజిగిరి	5,23,959	17,18,464
వలస కుటుంబాలు	4 లక్షల వరకు (అంచనా)	4 లక్షల వరకు (అంచనా)

'సి-విజిల్'ను సద్వినియోగం చేసుకోండి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికలు పారదర్శకంగా జరగడానికి ప్రజలు సి-విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా, భయభ్రాంతులకు గురి చేసినా, బలవంతంగా ప్రభావితం చేసినా సి-విజిల్ యాప్ ద్వారా ఎవరైనా సరే సమాచారం ఇవ్వొచ్చని తెలిపారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో సమస్యను పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఎలక్షన్ కమిషన్ ప్రజల చేతిలో సి-విజిల్ అనే బ్రహ్మాస్త్రం పెట్టిందని, ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న వారెవరైనా యాప్‌ను ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. సమస్యను ఎప్పటికప్పుడు కెమెరా ఆన్ చేసుకొని ఫొటో లేదా వీడియో తీసి సమస్యను సంక్షిప్తంగా టైప్ చేసి పంపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సి-విజిల్ ద్వారా చేసే ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచబడుతాయని తెలిపారు. తమ కళ్లముందు కనిపిస్తున్న అన్యాయాన్ని వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ యాప్ సురక్షితమైనదని, దీనిని ఆపరేటింగ్ చేయడం సైతం చాలా సులువైందన్నారు. ఇంగ్లిష్, తెలుగులో సమస్యను పంపించవచ్చని కలెక్టర్ సూచించారు.



వ్యయ పరిశీలకులు ఉత్పల్‌కుమార్ నస్కర్, అజిత్‌సింగ్ యాదవ్‌తో చర్చిస్తున్న కలెక్టర్ భారతి హోళికేరి

కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

ఎన్నికల ఫిర్యాదుల కోసం కలెక్టరేట్ సముదాయంలో కంట్రోల్ రూమ్ సహా టోల్ ఫ్రీ నంబర్ 040–23238545 ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూం 24 గంటలు పని చేస్తుంది. సిబ్బంది అందుబాటులో ఉంటారు. రిజిస్టర్ ఏర్పాటు చేసి వచ్చిన ఫిర్యాదులను రికార్డ్ చేయనున్నారు. జిల్లా ప్రజలు ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదుల కోసం ఈ టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

ఎన్నికల వ్యయ పరిశీలకులు

భారత ఎన్నికల కమిషన్ జిల్లాకు పోలీసు (ఎన్నికల వ్యయ) పరిశీలకులను నియమించింది. వీరిలో ఐపీఎస్ కేడర్ (2006 బ్యాచ్)కు చెందిన ఉత్పల్ కుమార్ నస్కర్, ఐపీఎస్ కేడర్ (2011 బ్యాచ్)కు చెందిన అజిత్ సింగ్ యాదవ్ ఉన్నారు. శుక్రవారం జిల్లాకు చేరుకున్న పోలీస్ పరిశీలకులకు కలెక్టర్ భారతి హోళికేరి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఆహ్వానం పలికారు. ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజక వర్గాలకు ఉత్పల్ కుమార్ నస్కర్‌ను, శేరిలింగంపల్లి, చేవెళ్ల, కల్వకుర్తి, షాద్‌నగర్ నియోజకవర్గాలకు అజిత్‌సింగ్ యాదవ్ నియమితులయ్యారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ అధికారులు జిల్లాలో చేపట్టిన బందోబస్తు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

30 కిలోల గంజాయి పట్టివేత

రూ.7.50 లక్షల విలువ

అబ్దుల్లాపూర్‌మెట్: గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అతని నుంచి రూ.7.50 లక్షల విలువ చేసే 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ నుంచి మహారాష్ట్రకు గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో ఎల్‌బీనగర్ ఎస్ఓటీ బృందం, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంయుక్తంగా పెద్దఅంబర్‌పేట ఔటర్ వద్ద గురువారం రాత్రి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన వినోద్‌కిషన్ రావు భాస్కె అలియాస్ సోను వృత్తి రీత్యా లారీడ్రైవర్. గంజాయిని అక్రమంగా సరఫరా చేసి డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో విశాఖపట్నం నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపారు.

తలపాగా చుట్టాం.. పాగా వేస్తాం



ఎల్‌బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి శుక్రవారం భారీ ర్యాలీతో తరలివెళ్లి నామినేషన్‌ను దాఖలు చేశారు. బీజేపీ కార్యకర్తలు, అభిమానులతో విజయవాడ జాతీయ రహదారి హయత్‌నగర్ నుంచి కొత్తపేట వరకు జనసంద్రంగా మారింది. చింతలకుంట వద్ద బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ హాజరై కార్యకర్తలు, అభిమానుల్లో హుషారు నింపారు.

– మన్సూరాబాద్

చేతులెత్తండి నుంచి ఈవీఎం

- ఓటుహక్కు వినియోగంలో సమూల మార్పులు
- సాంకేతికతను అందిపుచ్చుకున్న ఎలక్షన్ కమిషన్





షాద్‌నగర్: ఒకప్పుడు చేతులెత్తి అభ్యర్థిని ఎన్నుకునే స్థాయి నుంచి నేడు ఈవీఎంల సహాయంతో ఓటుహక్కును వినియోగించుకునే స్థాయికి మన దేశం ఎదిగింది. మన దేశాన్ని పాలించిన ఆంగ్లేయుల కాలం నుంచి పౌరులు ఓటుహక్కును వినియోగించుకుంటున్నారు. స్వాతంత్య్రం సిద్ధించిన తర్వాత మొదటిసారి సాధారణ ఎన్నికలు 1952లో జరిగాయి. అప్పట్లో దేశంలోని పౌరులందరికీ ఓటుహక్కు ఉండేది కాదు. ఉద్యోగులు, అక్షరాస్యులతో పాటు భూస్వాములకు మాత్రమే ఓటుహక్కు కల్పించారు. నాడు మండలాలను ఫిర్కాలుగా పిలిచేవారు. గ్రామస్థాయిలో విలేజ్ మేజిస్ట్రేట్(వీఎం)లు ఉండేవారు. వీరి వద్దనే ఓటర్లుగా నమోదు చేసుకొని ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకునే వారు. ఓటు వేసే విధానంలో కూడా తేడా ఉండేది. ప్రత్యక్ష పద్ధతిలో బహిరంగ సభను నిర్వహించి మెజార్టీ కోసం చేతులెత్తి ఓటును వినియోగించుకునే విధానం అమల్లో ఉండేది.

ఒక్కో అభ్యర్థికి ఒక్కో బాక్స్..

1952, 1957లో జరిగిన సాధారణ ఎన్నికల్లో పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థికి ఒక బాక్స్‌ను ఏర్పాటు చేసేవారు. ఓటర్లు వారికి నచ్చిన వ్యక్తికి సంబంధించిన బాక్స్‌లో ఓటు వేసేవారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల నుంచి పోటీలో ఎంతమంది అభ్యర్థులు ఉన్నా ఒకే బాక్స్‌ను కేటాయించి అందులోనే ఓటు వేసే విధానాన్ని తీసుకొచ్చారు. 1962 నుంచి ప్రతీ పోలింగ్ కేంద్రంలో అభ్యర్థులందరికీ ఒకే బాక్స్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో 70 శాతానికి మించి పోలింగ్ నమోదైతే రిగ్గింగ్ జరిగిందని అధికారులు నిర్ధారణకు వచ్చేవారు. తర్వాత క్రమంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. రహస్య పోలింగ్ విధానం ప్రస్తుతం అమల్లో ఉంది. బ్యాలెట్ పత్రాలతో ఓటువేసే విధానం నుంచి ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రాలను ఉపయోగించే స్థాయికి సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. ప్రస్తుతం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ భారత రాజ్యాంగం ఓటుహక్కు కల్పించింది.

ఆగమేఘాల కమలం

సాక్షి, సిటీబ్యూరో: బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రకటనల నుంచి బీఫాంల జారీ.. నామినేషన్ల దాకా అంతా సజావుగా సాఫీగా సాగగా.. ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీల్లో చివరి క్షణం దాకా జాప్యం.. అభ్యర్థుల పేర్ల మార్పు వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. నామినేషన్ల దాఖలుకు శుక్రవారం చివరి రోజు కాగా గురువారం రాత్రి వరకు గ్రేటర్ పరిధిలో బీజేపీ 5 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. ఆగమేఘాలపై అభ్యర్థులను ఖరారు చేసి వారికి నేరుగా ఫోన్ ద్వారా సమాచారమిచ్చారని పార్టీ నేతలు పేర్కొన్నారు. తమకు ఫోన్లు వచ్చినట్లు పేర్కొన్న కొందరిలో శుక్రవారం ప్రకటించిన అధికారిక జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో కంగు తిన్నారు. మేడ్చల్ నియోజకవర్గానికి మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డిని ఖరారు చేసినట్లు సమాచారమిచ్చి.. ఆయన స్థానంలో అక్కడ ఏనుగు సుదర్శన్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో విక్రమ్‌రెడ్డి రెబెల్‌గా నామినేషన్ దాఖలు చేశా రు. కంటోన్మెంట్‌లో తొలుత మాజీ పోలీస్ ఉన్నతాధికారి కృష్ణప్రసాద్ పేరు ఖరారైనట్లు చెప్పి.. తీరా జాబితాలో శ్రీగణేశ్ నారాయణ్‌ను అభ్యర్థిగా ప్రకటించారు.



మహేశ్వరం: నామినేషన్ వేస్తున్న బీఎస్పీ అభ్యర్థి కొత్త మనోహర్‌రెడ్డి



ఆమనగల్లు: కసిరెడ్డి తరఫున నామినేషన్ వేస్తున్న ఆయన సతీమణి

ముగిసిన నామినేషన్ల ఘట్టం

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం ముగిసింది. శుక్రవారం జిల్లాలో ప్రధాన పార్టీల నుంచి సబితారెడ్డి(బీఆర్‌ఎస్), జైపాల్ యాదవ్(బీఆర్‌ఎస్) ఆచారి(బీజేపీ) నామినేషన్లు దాఖలు చేశారు. ఇక మిగిలింది నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ మాత్రమే. ఎన్నికల్లో ప్రధాన పార్టీ టికెట్లు దక్కకపోవడంతో రెబల్, ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన అభ్యర్థులను బుజ్జగించే పనుల్లో ఆ పార్టీ నేతలు నిమగ్నమయ్యారు.

– సాక్షి, నెట్‌వర్క్



చేవెళ్ల: నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం, చిత్రంలో కేంద్రమంత్రి బీఎల్.వర్మ



మహేశ్వరం: నామినేషన్ వేస్తున్న శివప్రసాద్ (స్వతంత్ర)



ఆమనగల్లు: జైపాల్‌యాదవ్ తరఫున నామినేషన్ వేస్తున్న సత్యం

ప్రచార రథం అడ్డగింత

ఇద్దరిపై కేసు నమోదు

అబ్దుల్లాపూర్‌మెట్: బీఆర్‌ఎస్ కళాకారుల ప్రచార రథాన్ని అడ్డగించడంతో పాటు బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని చిన్నరావిరాల గ్రామంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కళాకారుల ప్రచారరథం తిరుగుతుండగా అదే గ్రామానికి చెందిన బండారి సత్యనారాయణ, కళ్లెం ధర్మారెడ్డి అడ్డుకుని కళాకారులను తిట్టడటంతో పాటు బెదిరించారు. దీంతో కళాకారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మోహన్ తెలిపారు. ఇద్దరిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామన్నారు.

బీజేపీకి బలమైన కేడర్

మాజీ ఎంపీ కొండా

చేవెళ్ల: రాష్ట్రంలో ఎప్పుడూ హంగు పరిస్థితి రాలేదని.. ప్రజలు ఏదో ఒక పార్టీకి మెజార్టీ అందిస్తారని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ అభ్యర్థి కేఎస్.రత్నం నామినేషన్ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కొండా మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి గ్రామాల్లో బలమైన కేడర్ ఉందని ఈ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి రాబోతుందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్, చేవెళ్లలో ఎమ్మెల్యే కాలె యాదయ్య కుటుంబ పాలన సాగుతుందన్నారు. రత్నం గెలుపు ఖాయమన్నారు. రెండుసార్లు ఓటమి పాలైన రత్నం మూడోసారి తప్పకుండా గెలుస్తారన్నారు. జిల్లాలో బీజేపీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్.రత్నం, నాయకులు కంజర్ల ప్రకాశ్, ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, రామ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చిత్రంలో రత్నం

ఓటు.. కారాదు వృథా



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

తుర్కయంజాల్: ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం పురపాలక సంఘం పరిధిలోని కమ్మగూడలో 243, 244, 245, 246 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమన్నారు. ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అర్హులందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

డీసీఎంను ఢీకొట్టిన కారు

ఇద్దరి దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: డీసీఎం వాహనాన్ని కారు ఢీకొట్టగా ఇద్దరు దుర్మరణం చెందిన సంఘటన బొంగులూర్ సమీపంలోని ఓఆర్‌ఆర్‌పై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం వైపు మినీ డీసీఎం వాహనం మార్బుల్స్ లోడుతో వెళ్తోంది. ఈ క్రమంలో ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్–13 వద్దకు చేరుకోగానే డీసీఎం టైర్ పంక్చర్ అయింది. దీంతో డ్రైవర్ మరమ్మతులు చేస్తుండగా.. అటుగా వస్తున్న కారు ఆగిఉన్న డీసీఎంను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన రాంబాబు(30), మరో గుర్తు తెలియని వ్యక్తి(33) అక్కడికక్కడే మృతి చెందారు. డీసీఎం డ్రైవర్ శ్రీనుకు స్వల్ప గాయాలవ్వగా ఆస్పత్రికి తరలించారు.

34 మంది 54 సెట్ల నామినేషన్లు

మహేశ్వరం: మహేశ్వరం అసెంబ్లీ స్థానానికి శుక్రవారం 17 మంది అభ్యర్థులు 19 సెట్ల నామినేన్లు వేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూరజ్ కుమార్ తెలిపారు. నామినేషన్ వేసిన వారిలో బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పట్లోళ్ల సబితారెడ్డి, బీఎస్పీ నుంచి కొత్త మనోహర్‌రెడ్డి, భారతీయ క్రాంతి సంఘ్ పార్టీ నుంచి తుమ్మటి శ్రీరాములు యాదవ్, జన రాజ్యం పార్టీ నుంచి లక్ష్మణాచారి, యుగ తులిసి పార్టీ నుంచి గోలి సబిత, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఖలీల్ ఉజ్ జామా, శివసేన పార్టీ నుంచి మహేష్ కుమార్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి మల్లేశ్ పిప్పాల, పిరమిడ్ పార్టీ ఇండియా నుంచి బ్రహ్మారెడ్డి, యుగతులిసి పార్టీ నుంచి నర్సింగ్ రావు, ఆల్ ఇండియా మజ్లిస్ ఈ–ఇన్కిలాబ్–ఈ–మిలాత్ పార్టీ నుంచి సయ్యద్ అజీముద్దీన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా.. చిక్కుల శివ ప్రసాద్, నర్సింహారెడ్డి పగిల్లా, అరవింద్‌రెడ్డి మర్యాద, ఉప్పల మహేందర్, మద్ది సబిత నామినేషన్లు దాఖలు చేశారు. శివసేన పార్టీ అభ్యర్థి మహేష్ ఒక్కరే రెండు సెట్లను దాఖలు చేశారు. మొత్తంగా 34 మంది అభ్యర్థులు 54 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తిచేసినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి హోటల్ తాజ్‌కృష్ణాలో ఎన్నికల కమిషన్ జిల్లాలకు నియమించిన పోలీస్, జనరల్ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు.

టీ తాగి.. రిలాక్స్ అవుతా

టీస్టాల్‌లో కేంద్ర మంత్రి

చేవెళ్ల: బీజేపీ అభ్యర్థి నామినేషన్ కోసం వచ్చిన కేంద్రమంత్రి బీఎల్.వర్మ ఓ సాధారణ వ్యక్తిలా చేవెళ్లలోని ఓ టీస్టాల్ వద్ద టీ తాగుతూ కనిపించారు. శుక్రవారం చేవెళ్లలో బీజేపీ అభ్యర్థి కేఎస్.రత్నం నామినేషన్ ర్యాలీ, దాఖలు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. నామినేషన్ కేంద్రానికి వెళ్తుండగా మార్గమధ్యలో కేఎస్.రత్నం మీడియాతో మాట్లాడుతుండగా కేంద్రమంత్రి వర్మ మాత్రం ఒక సాధారణ వ్యక్తిలా పక్కనే ఉన్న టీస్టాల్ వద్దకు వెళ్లి టీ తాగారు. ఆయన పక్కనే ఓ గన్‌మెన్ మాత్రమే ఉన్నారు. అయితే నామినేషన్ కావటంతో ఆ రోడ్డులో పోలీసులు ఇతరులను అనుమతించలేదు. దీంతో ఆయన కాసేపు సేదతీరుతూ కనిపించారు.



చాయ్ తాగుతున్న కేంద్రమంత్రి వర్మ

బాలాజీ.. కరుణించు

మొయినాబాద్: మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. ఎన్నికల నామినేషన్ సందర్భంగా శుక్రవారం ఉదయం ఆమె తన కుమారుడు కౌశిక్‌రెడ్డితో కలిసి దేవాలయానికి వచ్చారు. నామినేషన్ పత్రాలు స్వామివారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు రంగరాజన్ మంత్రి సబితారెడ్డిని ఆశీర్వదించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహగౌడ్, మాజీ ఉపసర్పంచ్ ఆంద్రూ తదితరులు ఉన్నారు.



చిలుకూరు ఆలయ సిబ్బందితో మంత్రి సబితారెడ్డి

సబితారెడ్డి ఆస్తులు రూ.9.27 కోట్లు

- చేతిలో రూ.6,50,000 నగదు
- అప్పులు ఏమీ లేవు
- ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి



మహేశ్వరం: తనకు రూ.9 కోట్లకు పైగా ఆస్తులున్నాయని, తనపై నాలుగు కేసులున్నాయని ఎన్నికల నామినేషన్ అఫిడవిట్‌లో మహేశ్వరం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పట్లోళ్ల సబితారెడ్డి పేర్కొన్నారు. ఆమె పేరు మీద కారు లేదని, చేతిలో రూ.6 లక్షల50వేల నగదు, 900 గ్రాముల బంగారం ఉందని అఫిడవిట్‌లో తెలిపారు.

స్థిరాస్తులు:

సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం మాద్రి గ్రామం, తాండూరు మండలం మల్కాపూర్, చేవెళ్ల మండలం కౌకుంట్ల, తాండూరు మండలం కోటబాసుపల్లి, చేవెళ్ల మండల కేంద్రంలో సుమారు రూ.2.28 కోట్లు విలువ చేసే 35.19 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కమర్షియల్ ఆస్తులు హైదరాబాద్‌లోని శ్రీనగర్, శంషాబాద్ మధురానగర్, తాండూరులో శంకర్‌రావు నగర్, చేవెళ్ల కౌకుంట్ల గ్రామాల్లో రూ.7.97 కోట్లు విలువ చేసే ఇళ్లు, ప్లాట్లు ఉన్నాయి. అప్పులు ఏమీ లేవు. చరాస్తులు, స్థిరాస్తులు మొత్తం రూ.9.27 కోట్లు ఉన్నాయని తెలిపారు.

కేఎల్‌ఆర్ ఆస్తులు రూ.12.25 కోట్లు

- అప్పులు రూ.5.98 కోట్లు
- సొంత ఇల్లు, కారు లేదు
- సతీమణి పేరిట భారీగా ఆస్తులు, అప్పులు
- అఫిడవిట్‌లో మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి



మహేశ్వరం: తనపేరున రూ.12.25 కోట్లకు పైగా ఆస్తులున్నాయని, పలు పోలీస్ స్టేషన్లో నాలుగు కేసులున్నాయని ఎన్నికల నామినేషన్ అఫిడవిట్‌లో మహేశ్వరం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. తన పేరు మీద కారు, ఇళ్లు లేదని తెలిపారు. ఆయన వద్ద రూ.7లక్షల54 వేల నగదు, రూ.11.44 లక్షల విలువ చేసే 220 గ్రాముల బంగారం ఉందన్నారు.

స్థిరాస్తులు:

కర్ణాటకలో రూ.30 లక్షల విలువ చేసే 10 ఎకరాల 91 సెంట్ల వ్యవసాయ పొలం ఉంది. కారు, బంగ్లా లేదని అఫిడవిట్‌లో చూపించారు. రూ.11 లక్షల 44 వేల విలువ చేసే 220 గ్రాముల బంగారం ఉంది.

అప్పులు:

లక్ష్మారెడ్డిపైన రూ.5.98 కోట్లు అప్పులు ఉండగా, ఆయన భార్య పేరు మీద రూ.19 కోట్లు అప్పులున్నాయి.

సతీమణి విజయలక్ష్మీ పేరిట:

కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సతీమణి విజయలక్ష్మీ రెడ్డి పేరు మీద సుమారు రూ.51 కోట్ల విలువ చేసే స్థిరాస్తులున్నాయి. మేడ్చల్‌లో ఎకర 19 గుంటల భూమి, అంతప్పగూడ గ్రామం, శంకర్‌పల్లి మండలంలో 5 ఎకరాల 6 గుంటలు, మాసాని గూడ, శంకర్‌పల్లి మండలంలో 13 ఎకరాల 8 గుంటలు, గొల్లపల్లి కలాన్, శంషాబాద్ మండలంలో 34 గుంటలు, మంఖాల్‌లోని గిగా సిటీ లేఅవుట్‌లో 2470 గజాల ప్లాట్ ఉంది. దీంతో పాటు పలుచోట్ల ఆస్తులున్నాయి. రూ.19లక్షల విలువ చేసే కియా కార్నివాల్ కారు ఉంది. రూ.33లక్షల 80వేల విలువ చేసే 650 గ్రాముల బంగారం ఉంది. అప్పులు రూ.19 కోట్ల 85 లక్షలు ఉన్నాయి. స్థిరాస్తులు, చరాస్తులు ఎక్కువ మొత్తంలో భార్య విజయలక్ష్మి పేరు మీద ఉన్నారు. అప్పులు కూడా ఆమె పేరు మీదనే ఎక్కువగా ఉన్నాయని అఫిడవిట్‌లో చూపించారు.